
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



ఉష్ణోగ్రత: గరిష్ఠం 34.0 కనిష్ఠం 18.0



రంజాన్ వేళలు

ఇఫ్తార్-గురువారం
సాయంత్రం - 6.29

సహార్- శుక్రవారం
ఉదయం - 5.08



మల్లికార్జునస్వామిని దర్శించుకుంటున్న ప్రసాద్‌కుమార్

దైవచింతన అలవర్చుకోవాలి

» శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

మోమిన్‌పేట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరూ దైవచింతన అలవర్చుకోవడంతో మానసిక ప్రశాంతత లభిస్తుందని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని దుర్గం చెరువు భ్రమరాంభ మల్లికార్జునస్వామిని ఆయన దర్శించుకున్నారు. స్వామి వారి ఉత్సవాలను కలిసిమెలిసి జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, నాయకులు నరోత్తంరెడ్డి, సుభాష్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, వెంకటేశం, మహేందర్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

శివపార్వతుల కల్యాణోత్సవంలో..

వికారాబాద్: వికారాబాద్ పరిధిలోని న్యూ గాంధీగంజ్ అన్నపూర్ణ సహిత కాశీవిశ్వేశ్వరాలయంలో బుధవారం నిర్వహించిన శివపార్వతుల కల్యాణంలో విశిష్ట అతిథులుగా మాధవానంద భారతి సరస్వతీ, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ పాల్గొన్నారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు, ఆలయ ధర్మకర్త ఎ.సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో చివరి రోజు పూజలు నిర్వహించారు. పూజలకు భక్తులు హాజరై అన్నదానంలో పాలుపంచుకున్నారు.



విద్యార్థులకు తిరిగి డబ్బులు ఇస్తున్న ప్రిన్సిపాల్ ప్రమీల

రూ.300 తిరిగి ఇచ్చిన ప్రిన్సిపాల్

» స్పందించిన విద్యాశాఖ అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మర్పల్లి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మర్పల్లి మోడల్ స్కూల్‌లో హాల్‌టికెట్ ఇచ్చే సమయంలో డొనేషన్ పేరుతో వసూలు చేసిన రూ.300లను బుధవారం విద్యార్థులకు తిరిగి ఇచ్చేశారు. 'రూ.300 ఇస్తేనే హాల్‌టికెట్' అనే శీర్షికన బుధవారం ప్రచురితమైన కథనానికి జిల్లా ఉన్నతాధికారులు స్పందించారు. జిల్లా విద్యాధికారి రేణుకాదేవి మండల విద్యాధికారి అంజిలయ్యను పాఠశాలకు వెళ్లి పూర్తి విచారణ జరిపి నివేదిక అందించాలని ఆదేశించారు. దీంతో ఆయన మోడల్ స్కూల్‌కు వెళ్లి విద్యార్థుల దగ్గర డబ్బులు వసూలు చేశారా? లేదా? అని ఆరా తీశారు. డబ్బులు వసూలు చేస్తే వెంటనే తిరిగి ఇవ్వాలని ఆదేశించడంతో డబ్బులు ఇచ్చిన విద్యార్థులను పిలిపించి వారికి తిరిగి అందించారు. డొనేషన్ పేరుతో డబ్బులు వసూలు చేయడం సరైంది కాదని, పాఠశాలలో సమస్యలు ఉంటే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలే తప్ప విద్యార్థుల నుంచి వసూలు చేయరాదని ఆయన ప్రిన్సిపాల్‌ను హెచ్చరించారు.



కొడంగల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల సెంటర్ వద్ద విద్యార్థులు

తొలిరోజు ప్రశాంతం

వికారాబాద్‌లో 7,937 మంది విద్యార్థులు హాజరు

జిల్లాలో ఇంటర్మీడియట్ ఫస్టియర్ పరీక్ష తొలిరోజు బుధవారం ప్రశాంతంగా జరిగింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోలేదు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు పరీక్ష కొనసాగింది. పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు గంట ముందే చేరుకున్నారు. వారితోపాటు తల్లిదండ్రులు పరీక్ష కేంద్రాలకు రావడంతో పరిసరాలన్నీ రద్దీగా మారాయి. అధికారులు హాల్‌టికెట్లను పరిశీలించి విద్యార్థులను సెంటర్లలోకి అనుమతించారు.

- ఆలస్యంగా వచ్చిన నలుగురికి నో ఎంట్రీ
- మేడ్చల్ జిల్లాలో 69,842 మంది హాజరు
- నేటి నుంచి సెకండియర్ పరీక్షలు



ఘట్‌కేసర్ రూరల్: అవుషాపూర్‌లో..



వికారాబాద్‌లోని ఓ సెంటర్ వద్ద విద్యార్థులను చెక్ చేస్తున్న సిబ్బంది

వికారాబాద్/మేడ్చల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఇంటర్ ప్రథమ సంవత్సరం మొదటి పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. బుధవారం జరిగిన ఈ ఎగ్జామ్‌కు జిల్లాలో 8,177 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 7,937 మంది హాజరు కాగా, 240 మంది గైర్హాజరయ్యారు. జనరల్ విద్యార్థులు 6,638 మంది ఉండగా, వారిలో 6,492 మంది హాజరు కాగా, 146 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 1,539 మంది హాజరు కావాల్సి ఉండగా, వారిలో 1,445 మంది హాజరు కాగా, 94 మంది గైర్హాజరయ్యారు. తొలిరోజు ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదు. పలు కారణాలతో ఆలస్యంగా వచ్చిన నలుగురు విద్యార్థులను పరీక్షా కేంద్రాల్లోకి నిర్వాహకులు అనుమతించలేదు. అలాగే జిల్లా వ్యాప్తంగా పలు కేంద్రాలను తనిఖీ బృందాలు సందర్శించాయి. డెక్ బృందంలోని ముగ్గురు సభ్యులు వికారాబాద్, తాండూరులోని పరీక్ష కేంద్రాలను తనిఖీ చేయగా, రెండు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు పరిగి, కులకచర్ల,

మిగతా 8వ పేజీలో...



చెస్ ఆడుతున్న మహిళా అధికారులు

కలెక్టరేట్‌లో ఆటల పోటీలు

మేడ్చల్ ప్రతినిధి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం కలెక్టరేట్‌లో మహిళా అధికారులకు క్రీడాపోటీలు నిర్వహించారు. తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి పాల్గొన్నారు. వారికి డ్యాన్స్, టగ్ ఆఫ్ వార్, చెస్ తదితర ఆటలను నిర్వహించారు. గెలుపొందిన వారిని సన్మానించి మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో డీఆర్‌వో హరిప్రియ, డీఈవో విజయలక్ష్మి, వినోద్‌కుమార్, కార్యదర్శి కురుమూర్తి, గోపాల్‌రావు, శివ ప్రసాద్, రవీందర్ పాల్గొన్నారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణలో చలివేంద్రాన్ని అధికారులు ప్రారంభించారు.



సాసర్‌పేట్‌లో నీళ్లు పోస్తున్న సిబ్బంది

వన్యప్రాణుల దాహార్తి తీర్చేందుకు సాసర్‌పీట్లు

తాండూరు రూరల్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): వేసవి ప్రారంభం కావడంతో అటవీ శాఖ అధికారులు వన్యప్రాణులకు దాహార్తిని తీర్చేందుకు చర్యలు చేపట్టారు. తాగేందుకు అందుబాటులో నీరు లేక జీవాలు దాహార్తితో అలమటించే పరిస్థితి ఏర్పాడుతోంది. ఈ పరిస్థితిని గమనించిన అటవీశాఖ అధికారులు అటవీ ప్రాంతంలో సాసర్‌పీట్‌లను ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా తాండూరు మండలం జినగుర్తి అటవీ ప్రాంతంలో బుధవారం మూడు సాసర్ పీట్లను నిర్మించారు. తాండూరు అటవీ రేంజ్ అధికారి శ్రీదేవి సరస్వతీ ఆదేశాల మేరకు బీట్ ఆఫీసర్ మల్లయ్య ఆ సాసర్‌పీట్‌లలో నీళ్లను ట్యాంకర్ ద్వారా పోయించారు.

రాయితీ దక్కేనా?

పెండింగ్‌లో 1,06,396 ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు

- 31 వరకు ఫీజు చెల్లిస్తే 25శాతం రిబేటు
- రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో టెక్నికల్ సమస్యలు
- అధికారుల తీరుతో అయోమయం
- అవకాశం వచ్చినా పరిష్కారం కాని వైనం



కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల హెల్ప్‌డెస్క్

మేడ్చల్ ప్రతినిధి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): దేవుడు వరం ఇచ్చినా.. పూజారి అడ్డుకున్నట్లుగా ఉంది మేడ్చల్ జిల్లాలోని ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారుల పరిస్థితి. మార్చి 31లోపు ఎల్‌ఆర్‌ఎస్ రుసుము చెల్లిస్తే 25 శాతం రాయితీ వర్తిస్తుందని ప్రభుత్వం ప్రకటించింది. దీనిని సద్వినియోగం చేసుకునేందుకు దరఖాస్తుదారులు ముందుకువస్తున్నా వారి దరఖాస్తు పెండింగ్‌లో ఉన్నట్లు చెప్పడంతో అయోమయానికి గురవుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఎల్‌ఆర్‌ఎస్ కోసం 1,60,338 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో ఇప్పటి వరకు కేవలం 5,820 దరఖాస్తులను మాత్రమే అధికారులు ఆమోదించారు. 1,492 దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి. షార్ట్‌ఫాల్‌లో 17,812 దరఖాస్తులు, ప్రొహిబిటెడ్‌లో 26,798 దరఖాస్తులు ఉండగా 1,06,396 దరఖాస్తులు అధికారుల వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. ఇందులో 98,926 దరఖాస్తులు ఎల్-1 అధికారి వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను త్వరితగతంగా పరిష్కరించాల్సిన అధికారుల వద్దనే దాదాపు

మిగతా 8వ పేజీలో...

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు ఇలా	
మొత్తం	1,60,338
ఆమోదం	5,820
తిరస్కరణ	1,492
షార్ట్‌ఫాల్	17,812
ప్రొహిబిటెడ్	26,798
పెండింగ్	1,06,396

సాంకేతిక సమస్యలతో ఇబ్బందులు

ఎల్‌ఆర్‌ఎస్ చెల్లించే సమయంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియలో సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. త్వరలోనే వాటిని అధిగమించి ఈ ప్రక్రియను వేగవంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటి వరకు జిల్లాలో కీసర సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఒకే ఒక రిజిస్ట్రేషన్ జరిగింది.

-అశోక్, జిల్లా రిజిస్ట్రార్, మేడ్చల్



ముంపు కష్టాలకు చెక్!

రూ.16 కోట్లతో చిలుక వాగు ప్రక్షాళన

మరో రూ.2 కోట్ల టీయూఎఫ్‌ఐడీసీ నిధులు మంజూరు

7



అర్హులందరికీ సంక్షేమ పథకాలు

పీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్

ఘట్‌కేసర్ పరిధిలో ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ

7



దుద్యాలలోని కుట్టు శిక్షణ కేంద్రంలో మహిళలతో మాట్లాడుతున్న కలెక్టర్

అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

అధికారుల సమీక్షలో కలెక్టర్ ప్రతీక్‌జైన్

కొడంగల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): కడా కింద మంజూరైన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులను ఆదేశించారు. బుధవారం కడా కార్యాలయంలో కొడంగల్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలపై నారాయణపేట కలెక్టర్ సిక్తాపట్నాయక్‌తో కలిసి సంబంధిత శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు నిర్మాణ పనులు, విద్యుత్, తాగునీరు, భగీరథ పైపులైన్ పనులను నాలుగు నెలల్లో పూర్తి చేసి లక్ష్యాన్ని చేరుకోవాలని ఆదేశించారు. బీసీ బాలుర, డిగ్రీ కళాశాల, బీసీ గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలల నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. దౌల్తాబాద్ కేజీబీవీ, పీహెచ్‌సీ, బొంరాస్‌పేట్ మండలంలో చేపట్టే పాఠశాల భవనం, అంగన్‌వాడీ, మహిళా సమాఖ్య భవనం, పంచాయతీ భవనం పనులకు టెండర్లు పూర్తి చేయాలన్నారు.

ఆస్పత్రి నిర్మాణ పనుల పరిశీలన

కొడంగల్‌లో షాదీఖానా నిర్మాణానికి ప్లాన్ తయారు చేయాలని అధికారులకు సూచించారు. ఆర్‌అండ్‌బీ ద్వారా చేపట్టే పనులను వెటర్నరీ, వైద్య కళాశాలలకు సంబంధించిన పనులను త్వరలో ప్రారంభించాలన్నారు. దుద్యాల, హకీంపేట్ రోడ్డు నిర్మాణ పనులకు సంబంధించి, జరుగుతున్న ప్రతీ పనికి సంబంధించిన ఫొటోలను ప్రతీరోజు గ్రూపులో అప్‌లోడ్ చేయాలన్నారు. ఈ వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం కొడంగల్‌లో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ

మిగతా 8వ పేజీలో...

కొడంగల్‌లో వ్యవసాయ కళాశాల

» యూనివర్సిటీ నుంచి ప్రతిపాదనలు కోరిన ప్రభుత్వం

» అనువైన స్థల ఎంపికకు అధికారుల కసరత్తు



వికారాబాద్, మార్చి5(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గంలో వ్యవసాయ కళాశాల ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు ప్రారంభమయ్యాయి. ఇందుకోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ప్రభుత్వం ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి సూచించింది. కళాశాల ఏర్పాటు చేసేందుకు 75 ఎకరాల నుంచి 100 ఎకరాల వరకు స్థలం అవసరం అవుతుంది. అలాగే భవనాల నిర్మాణానికి రూ.120 కోట్లు నిధులు అవసరమవుతాయి. 100 మంది వరకు బోధన, బోధనేతర సిబ్బందిని నియమించుకోవాల్సి ఉంటుంది. దీంతో కళాశాల ఏర్పాటుకు అనువైన స్థలాలను గుర్తించే పనిలో జిల్లా యంత్రాంగం నిమగ్నమైనట్లు తెలుస్తోంది. జిల్లా పూర్తిగా వ్యవసాయాధారిత ప్రాంతం కావడంతో వ్యవసాయ కళాశాల ఏర్పాటు సాగు అభివృద్ధికి దోహదపడనుంది. తాండూరులో వ్యవసాయ పరిశోధనా కేంద్రం కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఈ కేంద్రంలో వివిధ పంటలపై పరిశోధనలు కొనసాగుతున్నాయి.

ఎడ్యుకేషన్ హబ్‌గా కొడంగల్

కొడంగల్‌లో అన్ని రకాల చదువులు అందుబాటులోకి తీసుకువచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే మెడికల్ కళాశాలతో పాటు నర్సింగ్, ఫార్మసీ, ఫిజియోథెరపీ కళాశాలలు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం గతేడాది చర్యలు తీసుకుంది. ఈ ఏడాది కొత్తగా వ్యవసాయ కళాశాల ఏర్పాటు చేసే ప్రక్రియ ప్రారంభమైంది. వచ్చే విద్యా సంవత్సరం మెడికల్ కళాశాలతో పాటు ప్రభుత్వ నర్సింగ్, ఫార్మసీ, ఫిజియోథెరపీ కళాశాలలను ప్రారంభించాలన్న పట్టుదలతో ప్రభుత్వం ఉంది. కొత్తగా వ్యవసాయ కళాశాల ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం పచ్చజెండా ఊపగానే ఆ ప్రక్రియ కూడా ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది.

భూసేకరణ ప్రక్రియ వేగవంతం చేయండి

» నేషనల్ హైవే, ఇతర ప్రాజెక్టుల భూసేకరణపై సమీక్ష

వికారాబాద్: నేషనల్ హైవే, ఇతర ప్రాజెక్టుల నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతుల అంగీకారంతో త్వరితగతిన భూసేకరణ అవార్డు ఆమోదించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. హైవేతో పాటు ఇతర ప్రాజెక్టుల భూసేకరణపై బుధవారం కలెక్టర్ తన ఛాంబర్‌లో సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివాదంలో ఉన్న భూములకు సంబంధించిన నష్టపరిహారాన్ని ఆయా కోర్టుల్లో డిపాజిట్ చేసి భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్, నేషనల్ హైవే, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి..
విశేష స్పందన

చేవెళ్ల, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కమ్మెట లో బుధవారం మలక్‌పేట్ యశోద ఆస్పత్రి సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 200 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులను అందజేశారు.


వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

ప్రజలు ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని డాక్టర్లు సూచించారు. వైద్య శిబిరానికి భారీ స్పందన వచ్చిందని వైద్యుడు నవీన్‌కుమార్ తెలిపారు. ఇలాంటి వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్యులు మౌనిక, లిఖిత, అశోక్, అమర్, సుష్మ, నాయకుడు శశిధర్‌గౌడ్, గ్రామస్తులున్నారు.

విద్యార్థినికి న్యాయం చేస్తాం

● పరామర్శించిన స్పీకర్ ప్రసాద్‌కుమార్


విద్యార్థినితో మాట్లాడుతున్న ప్రసాద్‌కుమార్

వికారాబాద్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): కొత్తగడి బాలికల గురుకులం విద్యార్థిని తబిత బుధ వారం వికారా బాద్‌లో స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను కలిసింది. గురుకులంలో జరిగిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయనకు వివరించింది. ఘటనపై విచారణ చేయించి తగిన న్యాయం చేస్తానని తబితకు స్పీకర్ హామీ ఇచ్చారు. నం ఘటన పూర్వపరాలు తెలుసుకున్న స్పీకర్.. విద్యార్థినికి ధైర్యం చెప్పారు. బాగా చదువుకోవాలని, ఎలాంటి సమస్యొచ్చినా తనకు తెలియజేయాలని సూచించారు. మెరుగైన వైద్యం చేయిస్తానని భరోసా ఇచ్చారు.

వార్డు ఆఫీసర్ల వేతనాలు పెంచాలి

రాష్ట్ర మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖలో నియమితులైన వార్డు ఆఫీసర్లు తమ వేతనాలను పెంచాలని, ప్రయాణ భత్యాన్ని మంజూరు చేయాలని, ప్రమోషన్లు కల్పించాలని స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ.. డిగ్రీ విద్యార్హతతో టీజీపీఎస్సీ గ్రూప్-4 ద్వారా వార్డు ఆఫీసర్లుగా నియమితులై తమకు వేతనం 22,240 ఉందని, ఇది ఇంటర్మీడియట్ అర్హతతో కూడిన పోస్టులతో సమాన అని పేర్కొన్నారు. గ్రూప్4 ఉద్యోగుల కంటే మూడు ఇంక్రిమెంట్లు తక్కువగా వస్తున్నాయని వివరించారు. ఫీల్డ్ వర్క్, తనిఖీలు సర్వేలు నిర్వహించిన తమకు ప్రయాణ భత్యం కల్పించాలని కోరారు.

ఇతర రాష్ట్రాల వ్యాపారులతో బీసీలకు నష్టం

● జాతీయ బీసీ సంఘం కార్యవర్గ సభ్యుడు రాజ్‌కుమార్



తాండూరు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి తాండూరులో వ్యాపారాలు చేస్తున్న వారితో స్థానిక బీసీలు నష్టపోతున్నారని జాతీయ బీసీ సంఘం కార్యవర్గ సభ్యుడు రాజ్ కుమార్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. ఢిల్లీ సెలూన్లతో స్థానిక నాయీబ్రాహ్మణులకు పనిదొరకడం లేదని వాపోయారు. గుజరాత్, రాజస్థాన్, బిహార్, హర్యానా తదితర ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడ వ్యాపారం చేసుకుంటే ఎక్కువ నష్టపోయేది పట్టణ బీసీలేనని ఆవేదన వ్యక్తం చేశారు. అనాదిగా కుల వృత్తులపై ఆధారపడి జీవించే బీసీలు ఇతర పనులు చేయలేక, వేరే ప్రాంతాలకు వలస వెళ్లలేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. కార్పెంటర్లు, ప్లంబర్లు, ఎలక్ట్రీషియన్లు ఇతర ప్రాంతాల నుంచి రావడంతో స్థానికులు నష్టపోతున్నారని, ఈ విషయంలో ప్రభుత్వం స్థానికులకు న్యాయం చేయాలని ఆయన కోరారు.

పన్ను వసూళ్లను వేగవంతం చేయాలి


మాట్లాడుతున్న డీపీవో జయసుధ

నవాబుపేట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఇంటి పన్ను వసూళ్లను వేగవంతం చేయాలని జిల్లా పంచాయతీ అధికారి జయసుధ అన్నారు. బుధవారం వట్టిమీనపల్లి, మాదిరెడ్డిపల్లి గ్రామాల్లో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిశీలించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. డీపీవో మాట్లాడుతూ.. పన్నుల వసూలు చేపట్టాలన్నారు. వేసవిలో తాగునీటి సమస్య రాకుండా చర్యలుతీసుకోవాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో అనురాధ, ఎంపీవో విజయ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



చెరువును పరిశీలిస్తున్న విద్యార్థులు, ప్రొఫెసర్లు

నీటి సంరక్షణపై అధ్యయనం

మోమిన్‌పేట్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): వెల్చాల్, గోవిందాపూర్ గ్రామాల్లో బుధవారం రాజేంద్రనగర్ విశ్వవిద్యాలయానికి చెందిన 35 మంది పీజీ విద్యార్థులు వ్యవసాయం, నీటి సంరక్షణపై అధ్యయనం చేశారు. ఉపాధి హామీ పథకం, నాబార్డు నిర్మించిన కుంటల నిర్మాణం, చెక్‌డ్యాంలు, రాతి కట్టడాలను, పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ ఎండీ.లతీఫ్‌పాషా, ఏఈవో పెంటయ్య, శ్రీనివాస్, మాజీ సర్పంచ్ పోచయ్య, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎల్పీవో సంధ్యారాణి

తాగునీటి ఎద్దడి రాకుండా

చర్యలు తీసుకోవాలి

కులకచర్ల, మార్చి 5(ఆంధ్రజ్యోతి): వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా ఇప్పటి నుంచే తగిన చర్యలు తీసుకోవాలని డీఎల్పీవో సంధ్యారాణి సూచించారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. పారిశుధ్య కార్యక్రమాలను రోజూ చేయించాలన్నారు. వంద శాతం ఇంటి పన్ను వసూలు చేయాలని సూచించారు. కార్యదర్శులు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని తెలిపారు. సమావేశంలో ఎంపీడీవో రామకృష్ణ, ఎంపీవో భాస్కర్‌గౌడ్, పీఎస్‌లు పాల్గొన్నారు.



హ్యాకథాన్‌లో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌దే భవిష్యత్తు

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): భవిష్యత్తు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌దే అని ఏఐ హెచ్‌వోడీ మల్లికార్జున్‌రెడ్డి అన్నారు. బుధవారం వెంకటాపూర్ పరిధి అనురాగ్ యూనివర్సిటీలో నిర్వహించిన బూట్‌క్యాంప్ హ్యాకథాన్ ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథి హాజరై మాట్లాడారు. రానున్న కాలంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో నూతన సాంకేతిక విప్లవం రానుందన్నారు. ప్రతీ విద్యార్థి ఏఐలో సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. బూట్‌క్యాంప్‌లో ఎల్‌వోటీ, ఏఐ సెక్యూరిటీ, ఏఐ/ఎంఎల్ డెవలప్మెంట్ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు అర్చన, అనిత, రఘు, ప్రణీత్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

గణితంలో నాగరాజుకు డాక్టరేట్



ఆదిభట్ల, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మంచాల గ్రామానికి చెందిన జాంగిళ్ల నాగరాజుకు గణితంలో డాక్టరేట్ లభించింది. శివయ్య-జయమ్మల కుమారుడు నాగరాజు పదోవ తరగతి, ఇంటర్, ఇంజినీరింగ్, పీజీ అనంతరం ఉస్మానియా యూనివర్సిటీలో పీహెచ్‌డీ అడ్మిషన్ పొందాడు. 'ఆన్‌లైనర్ అండ్ నాన్ లైనర్ కన్వెక్షన్ ఆఫ్ ఎ కూపెస్ట్రెస్ ఫ్లూడ్ ఇన్ హారిజంటల్ లేయర్ విభాగంలో పీహెచ్‌డీ చేశాడు. ప్రొఫెసర్ రమేశ్‌బాబు పర్యవేక్షణలో థీసెస్ సమర్పించాడు. దీంతో ఆయనకు డాక్టరేట్ దక్కింది.



మున్సిపల్ మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న భరద్వాజ కాలనీ వాసులు

సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలి

మొయినాబాద్ రూరల్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): డ్రెయిన్లు లేక రోడ్లపైనే మురుగు పారుతోందని, దీంతో రోగాల బారినపడుతున్నామని మొయినాబాద్ మున్సిపల్ భరద్వాజ కాలనీ వాసులు అన్నారు. సమస్య తీర్చాలని బుధవారం మున్సిపల్ మేనేజర్ జమీల్‌కు వినతిపత్రం అందజేశారు. డ్రైనేజీలు, సీసీ రోడ్లు నిర్మించాలని కోరారు. నీటి కోసం పైప్‌లైన్ కనెక్షన్ ఇవ్వాలన్నారు. త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తామని మేనేజర్ చెప్పారని తెలిపారు. కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లేష్‌గౌడ్, ఉపాధ్యక్షుడు సలీం, ప్రధాన కార్యదర్శి కుమార్, స్థానికులు గఫ్ఫార్, జాహంగిర్, రవిరాజసాగర్, నర్సింహులు, రమేష్, జైపాల్‌రెడ్డి, నరేష్, రాఘురాంరెడ్డి, రఘు, అమిత్‌జాదవ్, సాజిద్ పాల్గొన్నారు.



ఆలయం వద్ద హోమంలో పాల్గొన్న భక్తులు

ఘనంగా కట్టమైసమ్మ ఆలయ వార్షికోత్సవం

మొయినాబాద్ రూరల్, మార్చి 5(ఆంధ్రజ్యోతి):మొయినాబాద్ పరిధి సురంగల్ పెద్దచెరువు కట్టమైసమ్మ ఆలయ రెండో వార్షికోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. అమ్మవారికి అర్చన, శతసప్త చండీయాగం నిర్వహించారు. మహిళలు కుంకుమార్చన చేశారు. హోమంలో ఆదాయపు పన్ను శాఖ మాజీ అధికారి రాములు దంపతులు, మల్లేష్‌గౌడ్ దంపతులు పాల్గొన్నారు. భక్తులకు అన్నదానం చేశారు. జైపాల్‌రెడ్డి, ఆలయ నిర్వాహకులు మల్లేష్‌గౌడ్, నర్సింహారెడ్డి, మాజీ సర్పంచ్‌లు లావణ్యాఅంజిరెడ్డి, భాస్కర్‌చారి, మాజీ ఎంపీటీసీ రమాదేవిరవీందర్‌రెడ్డి, నాయకులు గడ్డం అంజిరెడ్డి, వెంకట్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, మల్లేష్, మైసయ్య, మహేందర్‌రెడ్డి, కొంగరి నర్సింహారెడ్డి, ఈగ రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

చదువుతోనే సమాజంలో మార్పు

- విద్యాభివృద్ధికి బడ్జెట్‌లో 15శాతం నిధులు కేటాయించాలి
- ప్రభుత్వ స్కూళ్లను బలోపేతం చేయాలి
- ప్రొఫెసర్ జి.హరగోపాల్



మాట్లాడుతున్న హరగోపాల్

షాద్‌నగర్ అర్బన్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): చదువుతోనే సమాజంలో మార్పు వస్తుందని, పేదరికం పోతుందని అఖిల భారత విద్యాహక్కు వేదిక అధ్యక్షవర్గ సభ్యుడు, ప్రొఫెసర్ జి.హరగోపాల్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్ద జెడ్పీ పాఠశాలలో బుధవారం పూర్వ విద్యార్థుల, ఉపాధ్యాయుల సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హరగోపాల్ హాజరై మాట్లాడారు. మొగిలిగిద్ద హైస్కూల్ 150వ వార్షికోత్సవానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరై భవన నిర్మాణానికి రూ.10కోట్లు మంజూరు చేయడం అదృష్టం అని, పాఠశాల అభివృద్ధికి గ్రామస్థులంతా కృషిచేయాలని కోరారు. 34మంది టీచర్లు పనిచేస్తున్న ఈ పాఠశాలకు గ్రామంలోని ప్రతీ విద్యార్థిని పంపేలా తల్లిదండ్రుల్లో చైతన్యం తేవాలని కోరారు. ఉమ్మడి రాష్ట్ర బడ్జెట్‌లో విద్యకు 12శాతం నిధులు కేటాయించే వారని, తెలంగాణతో బడ్జెట్‌లో కేసీఆర్ దానిని ఆరు శాతానికి తగ్గించారని, ఎన్నిసార్లు విన్నవించినా బీఆర్ఎస్ పాలకులు పట్టించుకోలేదన్నారు. పొరుగు రాష్ట్రాల మాదిరిగా విద్యారంగానికి 15శాతం నిధులివ్వాలని కోరగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అంగీకరించారన్నారు. మొగిలిగిద్దలో ప్రకటనా చేశారన్నారు. ప్రభుత్వ టీచర్లు సైతం స్కూళ్లలో విద్యార్థుల సంఖ్యను పెంచి బాగా బోధించేందుకు శ్రమించాలని హరగోపాల్ పిలుపునిచ్చారు. ప్రొఫెసర్ జి.వనమాల మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు ప్రైవేట్ పాఠశాలలకు పిల్లలను పంపుతున్న తల్లిదండ్రులతో మాట్లాడి వారిలో మార్పు తేవాలని కోరారు. ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధి సహకరిస్తున్న జర్నలిస్టులను సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. హెచ్‌ఎం ఎస్.జనార్ధన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో టీచర్లు వెంకట్‌రెడ్డి, రాజు, గ్రామస్తులు జి.శ్యాంసుందర్, రాజమల్లారెడ్డి, మల్లేష్, దయాసాగర్, విజయ్‌కుమార్, శశిధర్, శ్రీశైలం, భవానీశంకర్, వెంకటేష్, పఠాన్‌పాషా, గిర్ని పాషా, ఆర్. సురేందర్, బబ్లూ, రంజిత్, రవి తదితరులు పాల్గొన్నారు.

ముంపు కష్టాలకు చెక్!

రూ.16కోట్లతో చిలుక వాగు ప్రక్షాళన పనులు

- మరో రూ.2కోట్ల టీయూఎఫ్ఐడీసీ నిధులు
- కాంట్రాక్టర్‌కు పనుల అప్పగింత
- రెండేళ్లలో శాశ్వత పరిష్కారం : ఎమ్మెల్యే

తాండూరు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): తాండూరు పట్టణవాసుల వరద కష్టాలకు చెక్ పడనుంది. వానకాలంలో వరదల నివారణకు ప్రణాళిక సిద్ధమైంది. 25ఏళ్లుగా వానకాలాల్లో వరదలతో ఇబ్బంది పడుతున్న పట్టణ ప్రజలకు వచ్చే వానకాలం నుంచి ఆ కష్టాలు దూరం కానున్నాయి. శాశ్వత పరిష్కారం కింద తుఫాన్, నీటి కాలువల నిర్మాణాలు చేపట్టాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్మెంట్ డిపార్ట్‌మెంట్ టీయూఎఫ్ఐడీసీ కింద రూ.16కోట్లు మంజూరు చేశారు. కాంట్రాక్ట్‌ను హైదరాబాద్‌కు చెందిన సంస్థ దక్కించుకుంది. సీపీసీబీ, సీపీహెచ్‌ఈఈవో, ఎన్జీటీ నిబంధనల మేరకు కాల్వ నిర్మాణం చేపడుతారు. మొదటి దశలో కాల్వను 1.3కి.మీ నిర్మిస్తారు. హైదరాబాద్ రోడ్డులో



పాత కుంట



వానకాలంలో నీట మునిగిన ఆదర్శనగర్ కాలనీ(ఫైల్)

పనులు ప్రారంభమవుతాయి. సాయిపూర్, గ్రీన్‌సిటీ మీదుగా చిలుకవాగును పాత తాండూరు వరకు తుఫాను నీటి కాల్వ(నాలా) నిర్మిస్తారు. ముంపు తీవ్రత తగ్గించేలా కాలువల బొటిల్లోల వద్ద వాటి విస్తీర్ణాన్ని పెంచి నిర్మిస్తారు.

తరచూ జలమయమయ్యే కాలనీలు..

ఆదర్శనగర్, గ్రీన్‌సిటీ, సాయిపూర్, టీచర్స్ కాలనీ, మార్కెండేయనగర్, వినాయక టెంపుల్ ఏరియా, భవానీనగర్, రాయల్‌కంట, హైదరాబాద్ రోడ్డు మార్గాల్లో తరచూ వరదలతో సమస్య ఉత్పన్నమవుతోంది. ఈ కాలనీల గుండా మురుగు కాల్వ నిర్మాణం చేపడతారు. తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఆదర్శనగర్ కాలనీ వినాయక ఆలయం నుంచి కాలువ నిర్మిస్తారు. ఈ ప్రాంతంలో డ్రెయిన్ల నిర్మాణానికి రూ.4.5కోట్లు అంచనా సిద్ధం చేశారు. ప్రస్తుతం రూ.2 కోట్లు మంజూరయ్యాయి. 450మీటర్ల మురుగు కాల్వ నిర్మిస్తారు.

వెనువెంటనే రెండో విడత పనులు

మంజూరైన నిధులతో చేసే పనులు పూర్తయ్యేలోపు రెండో విడత నిధులను రాబట్టాలని నిర్ణయించారు. సమస్య శాశ్వత పరిష్కారానికి రూ.30కోట్ల నుంచి రూ.35కోట్లు అదనంగా అవసరమని తేల్చారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మాట్లాడి ఈ నిధులను సాధించినట్టు తెలుస్తోంది.

వరద ముంపు లేకుండా చూస్తాం



దశాబ్దాలుగా తాండూరు పట్టణానికి వరదముంపు ప్రధాన సమస్యగా మారింది. కొద్దిగా వర్షం పడితే కాలనీలు జలమయమవుతున్నాయి. రానున్న వానకాలం నాటికి ఈ సమస్యను 80శాతం వరకు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఒప్పించి ఈ నిధులు సాధించాను. కాలనీల ముంపు సమస్య శాశ్వత పరిష్కారమే ధ్యేయంగా ప్రణాళిక సిద్ధం చేశాం. రెండేళ్లలో నాలాల పనులన్నీ పూర్తి చేస్తాం.

- మనోహర్‌రెడ్డి, ఎమ్మెల్యే, తాండూరు



ఏఐ బోధనను పరిశీలిస్తున్న బెంగళూరు బృందం, డీఈవో

ఏఐ బోధనను పరిశీలించిన

బెంగళూరు బృందం

దోమ, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొంపల్లి ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను బుధవారం బెంగళూరు బృందం, డీఈవో రేణుకాదేవి సందర్శించి ఏఐ బోధనను పరిశీలించారు. స్టడీలో వెనకబడిన విద్యార్థులను ఈ విధానంతో మెరుగుపర్చవచ్చన్నారు. ఈ విధానంతో బోధన విద్యార్థులకు సులభంగా అర్థంఅవుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో వెంకట్, హెచ్‌ఎం ఎండీ షఫీ, సీఆర్పీ వెంకటేశ్, టీచర్లు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు

తలకొండపల్లి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం ఏర్పాటు కోసం అవసరమైతే ఆమరణ నిరాహార దీక్ష చేస్తామని గట్టిప్పలపల్లి జేఏసీ నాయకులు ప్రకటించారు. తలకొండపల్లి మండలం గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించాలని చేపట్టిన రిలే నిరహార దీక్షలు బుధవారంతో 124వ రోజుకు చేరాయి. జేఏసీ నాయకులు, యువకులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు. 11 పంచాయతీలను కలిపి గట్టిప్పలపల్లిని మండలం చేయాలని జేఏసీ చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్‌చైర్మన్ శరత్‌చంద్ర, అంజనేయులుగౌడ్, కార్యదర్శి అనిల్ కోరారు. రాష్ట్రప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసే మండలాల జాబితాలో గట్టిప్పలపల్లిని చేర్చాలని వారు డిమాండ్ చేశారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



మూడుచింతలపల్లి: కేశవరంలో భూమిపూజ చేస్తున్న వజ్రేష్‌యాదవ్

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ సంక్షేమ పథకాలను వర్తింపజేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, ఘనాపూర్, ఫికర్‌టెక్య, లింగాపూర్ తండాల్లో బుధవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ రాజ్య స్థాపనే సీఎం రేవంత్‌రెడ్డి లక్ష్యమన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో చేయలేనిది తాము 14 నెలల్లో చేసి చూపామన్నారు. ఘనాపూర్‌లో 70ఇళ్ల నిర్మాణాలను పైలెట్ ప్రాజెక్టుగా తీసుకొని 27ఇళ్లకు భూమి పూజ చేశామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్, ఇన్‌చార్జి మేనేజర్ కవిత, మహేష్‌గౌడ్, పావని, మమత మహేష్‌గౌడ్, గోపాల్‌రెడ్డి, ఉదయ్ కుమార్‌రెడ్డి, మశ్చేందర్‌రెడ్డి, ముత్యాల్ యాదవ్, అమరేందర్, పరమేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి

మూడుచింతలపల్లి: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని, కాంగ్రెస్ పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారని తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. కేశవరంలో ఇందిరమ్మ ఇళ్ల భూమిపూజకు ముఖ్య అతిథిగా వచ్చారు. కేశవరానికి 105ఇళ్లు మంజూరయ్యాయన్నారు. అనంతరం అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గౌతమి, ఏఎంసీ చైర్మన్ నర్సింహులుయాదవ్, శ్రీనివాస్‌రెడ్డి, జగన్నాథం, హన్మంతరెడ్డి, అఖిలేష్‌రెడ్డి, బస్వారెడ్డి, వెంకటేశ్ పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు వెంటనే ఇవ్వాలి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నరేందర్‌రెడ్డి, నాయకులు

కొడంగల్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వంలో గ్రామాల్లో సర్పంచ్‌లు చేసిన పనులకు బిల్లులు వెంటనే విడుదలచేయాలని మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. కొడంగల్‌లోని కడ కార్యాలయంలో కలెక్టర్ ప్రతీక్‌జైన్‌కు మాజీ సర్పంచ్‌లు, నాయకులతో కలిసి బుధవారం వినతిపత్రం అందజేశారు. చేసిన పనులకు బిల్లులు రాక మాజీ సర్పంచ్‌లు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని, తెచ్చిన అప్పులకు మిత్తీలు కట్టలేక మానసిక వేదనకు గురవుతున్నారని అన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో బీఆర్ఎస్ నాయకులు మధుసూదన్‌రెడ్డి, మధుసూదన్‌యాదవ్, దామోదర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, శేరి నారాయణరెడ్డి, మహిపాల్‌రెడ్డి, దేశ్యనాయక్ తదితరులు ఉన్నారు.



లక్ష్మారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ప్రభాకర్‌రెడ్డి, అఫ్జల్‌బేగ్

నేదునూరును మున్సిపాలిటీలో కలపాలి

రంగారెడ్డి అర్బన్, మార్చి 5(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న మున్సిపల్ కార్పొరేషన్‌లో నేదునూరు గ్రామాన్ని కలపాలని మాజీ వైస్‌ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు అమరేందర్‌రెడ్డి, అఫ్జల్‌బేగ్, పాండురంగారెడ్డి కోరారు. ఈ మేరకు వారు బుధవారం కాంగ్రెస్ మహేశ్వరం ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. ప్రభుత్వం ఫోర్త్ సిటీ, ఫ్యూచర్ సిటీల పేరుతో ఏర్పాటు చేస్తున్న కార్పొరేషన్‌లో తమ గ్రామాన్ని ఎందుకు కలపడం లేదని వారు వాపోయారు. దీనిపై ప్రభుత్వ పెద్దలతో మాట్లాడాలని లక్ష్మారెడ్డిని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాకేశ్‌రెడ్డి, సురేష్, దర్శన్, కృష్ణానాయక్, వెంకటయ్య, మహేందర్, పాండు, భిక్షపతి, శ్రీరాములు, నరసింహ, రమేష్, భాస్కర్, నాని, శ్రీకాంత్, వెంకటేష్, దామోదర్, ప్రభాకర్, రవి పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈవో పాండు

విద్యార్థులు ఏకాగ్రతతో చదవాలి

ఆమనగల్లు, మార్చి 5(ఆంధ్రజ్యోతి):విద్యార్థులు ఒత్తడికి లోనుకాకుండా ఏకాగ్రతతో చదివితే ఉత్తమ ఫలితాలు వస్తాయని ఎంఈవో పాండు, టీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మీసాల లక్ష్మీనివాస్, రాష్ట్ర కో-ఆర్డినేటర్ కర్రి సుదర్శన్, సంఘ సేవకుడు పాపిశెట్టి రాము అన్నారు. త్వరలో పదోతరగతి వార్షిక పరీక్షల నేపథ్యంలో ఆమనగల్లులోని మానస గార్డెన్‌లో బుధవారం తెలంగాణ సామాజిక స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ముగింపు కార్యక్రమానికి సీనియర్ జర్నలిస్టు శ్రీదేవి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ముఖ్య వక్తలు మాట్లాడుతూ.. ఆత్మస్థైర్యమే విజయానికి సోపానమన్నారు. ర్యాంక్‌ల కోసం పిల్లలపై తల్లిదండ్రులు ఒత్తిడి చేయొద్దన్నారు. బాగా చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ టాలెంట్ టెస్ట్‌లో లిటిల్ స్కాలర్స్ టెక్నో స్కూల్ విద్యార్థిని క్రిస్టినా షారోన్ మొదటి, వివేకా విద్యాభారతి హైస్కూల్ విద్యార్థిని వైష్ణవి రెండో బహుమతి, బ్రిలియంట్ గ్రామర్ హైస్కూల్ విద్యార్థిని లహరి మూడో బహుమతి సాధించారు. కార్యక్రమంలో తెలంగాణ విద్యార్థి జేఏసీ చైర్మన్ రాజు, సెన్సార్ బోర్డు మెంబరు చంద్రశేఖర్, తెలంగాణ ఫిలిం డ్యాన్సర్ యూనియన్ నాయకుడు ప్రభుశంకర్, ట్రస్మా నాయకులు శివలింగం, అల్లాజీగౌడ్, టీచర్లు శర్మ, మహమూద్, శ్రీశైలం, శివ, సాయి, ధనుశ్, శివరాజ్ పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న శ్రీదేవి

రంగారెడ్డి జిల్లా కోర్టులు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని రంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీదేవి సూచించారు. న్యాయసేవాధికార సంస్థలో బుధవారం ఆమె మాట్లాడుతూ.. జాతీయ న్యాయసేవాధికార సంస్థ, తెలంగాణ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు మార్చి 8న రంగారెడ్డి జిల్లాలోని అన్ని కోర్టుల్లో లోక్‌అదాలత్ నిర్వహిస్తామన్నారు. ఇప్పటికే కోర్టు ముందుకు రాని కేసులు, పెండింగ్ కేసులను లోక్‌అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చన్నారు. లోక్‌అదాలత్‌లో కేసు దాఖలు చేస్తే కోర్టు రుసుం చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న సివిల్ కేసు లోక్ అదాలత్‌కు పంపి కేసు పరిష్కారమైతే కోర్టులో చెల్లించిన ఫీజు పార్టీలకు తిరిగి చెల్లిస్తామన్నారు. లోక్ అదాలత్‌లతో సమయం, డబ్బు వృథా కావని అన్నారు. లోక్‌అదాలత్‌లో రాజీకి ఆస్కారం ఉండే క్రిమినల్, సివిల్ కేసులు, కుటుంబ తగాదా, డబ్బు రికవరీ కేసులు, మోటార్ వెహికిల్/యాక్సిడెంట్ కేసులు, చిట్‌ఫండ్ కేసులు, ఎలక్ట్రిసిటీ కేసులు, చెక్‌బౌన్స్ కేసులను పరిష్కరించుకోవచ్చని ఆమె వివరించారు.


పరిగి: పరీక్షా కేంద్రం వద్ద నంబర్లు చూస్తున్న విద్యార్థులు


కొడంగల్: ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో విద్యార్థులు


వికారాబాద్: సిద్ధార్థ పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు

పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు


తాండూరు: పరీక్ష కేంద్రం తనిఖీలో డీఎస్పీ బాలకృష్ణారెడ్డి


మేడ్చల్: పరీక్ష కేంద్రం వద్దహాల్‌టికెట్ నంబర్ చేసుకుంటున్న విద్యార్థులు

ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. వికారాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో ఉదయం 9 గంటలకు పరీక్ష ఉండగా విద్యార్థులను గంట ముందే పరీక్ష కేంద్రాలకు అనుమతించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తరువాతే లోపలికి అనుమతించారు.

- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్


మోమిన్‌పేట్: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హాల్‌టికెట్ నెంబర్లు పరిశీలిస్తున్న విద్యార్థులు


పెద్దేముల్: పరీక్షకేంద్రం వద్ద విద్యార్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు


వికారాబాద్: ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద పోలీసుల బందోబస్తు


మర్పల్లి: పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులను తనిఖీ చేస్తున్న అధ్యాపకులు

తొలిరోజు ప్రశాంతం

(5వ పేజీ తరువాయి)

మోమిన్‌పేట్, కొత్తగడి, ఎన్నేపల్లిల్లోని కేంద్రాలను తనిఖీ చేశాయి. సిట్టింగ్ స్క్వాడ్ బృందాల సభ్యులు పెద్దేముల్, నవాబ్‌పేట్, కొడంగల్, మర్పల్లి పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. కాగా, తొలిరోజు పరీక్ష ప్రశాంతంగా కొనసాగిందని జిల్లా నోడల్ అధికారి శంకర్‌నాయక్ తెలిపారు.

మేడ్చల్ జిల్లాలో 1,444 మంది గైర్హాజరు

మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలో బుధవారం ఇంటర్ ప్రథమ సంవత్సరం తొలి పరీక్షకు మొత్తం 71,286 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 69,842 మంది విద్యార్థులు హాజరయ్యారు. జనరల్ విద్యార్థులు 69,808 మందికి గాను 68,438 మంది, ఒకేషనల్ 1,478 మందికి 1,404 మంది హాజరయ్యారు. కాగా, జనరల్ విద్యార్థులు 1,370, ఒకేషనల్ 74 మొత్తం 1,444 మంది తొలిరోజు పరీక్షకు గైర్హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా ఎటువంటి సంఘటనలు చోటు చేసుకోలేదు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలుతోపాటు అన్ని సెంటర్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అలాగే పరీక్ష కేంద్రాలను తనిఖీ చేయడానికి ప్రత్యేక అధికారులను ఏర్పాటు చేశారు.

డీపీఆర్‌వో ఫొటోగ్రాఫర్‌కు సన్మానం


కిషోర్ బాబును సన్మానిస్తున్న మేడ్చల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు

మేడ్చల్ ప్రతినిధి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ ఫొటోగ్రాఫర్ కిషోర్ బాబును బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా ఐ అండ్ పీఆర్ శాఖ ఆధ్వర్యంలో వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి(ఇన్‌చార్జి) స్వర్ణలతో పాటు ఇంజనీరింగ్ విభాగం అధికారి నాగాంజలి, శాఖ సిబ్బంది కిషోర్ బాబును శాలువాలతో సత్కరించి, ప్రశంసా పత్రాన్ని ప్రదానం చేశారు. డీఆర్‌డీవో సాంబశివరావు, కలెక్టరేట్ ఏఓ రాంమోహన్, కలెక్టర్ సీసీ చందన్, పలువురు రెవెన్యూ సిబ్బందితో పాటు వివిధ దినపత్రికల మేడ్చల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు కిషోర్ బాబును సన్మానించారు.

కాంగ్రెస్‌తోనే సంక్షేమం

చౌడాపూర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌తోనే బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మరికల్ గ్రామంలో బుధవారం ఆయన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన చేశారు. మల్కాపూర్ నుంచి కామారం వరకు రూ.కోటీ 25లక్షలతో వేసిన బీటీ రోడ్డును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అశోక్‌కుమార్, నాగరాజు, వెంకటయ్యగౌడ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

క్రీస్తు బండ చర్చి ప్రారంభం

కోట్‌పల్లి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): కరీంపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన క్రీస్తు బండ చర్చి ప్రారంభోత్సవానికి బుధవారం మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్ హాజరై చర్చిని ప్రారంభించినట్లు మండల అధ్యక్షుడు సుందరి అనిల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు సీయోను, దేవానంద్ పాల్గొన్నారు.

ఫ్యాక్టరీలో మెగా హెల్త్ క్యాంప్

యాలాల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బుధవారం ఆర్‌బీఎల్ ఫ్యాక్టరీలో మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఈ శిబిరంలో 112మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. హెచ్ఐవీ/ఎయిడ్స్, ఎస్టీఐ/ఎస్టీడీ నివారణ, హెచ్ఐవీ ఏవిధంగా వస్తుంది, నివారణకు మార్గాలు, 1097 టోల్‌ఫ్రీ సేవలపై వైద్యులు వివరించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, వైద్యులు జగదీశ్వరి, శిరీష, ఎస్ఎస్‌కే కౌన్సిలర్ పర్వతాలు, మేనేజర్ కృష్ణవేణి, ఆశావర్కర్స్ పాల్గొన్నారు.

వోల్టా గ్రీన్ కంపెనీలో మాక్ డ్రిల్

మోమిన్‌పేట్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): వేసవిని దృష్టిలో ఉంచుకొని మండలంలోని మొరంగపల్లి గ్రామ శివారులోని వోల్టా గ్రీన్ కంపెనీలో బుధవారం అగ్నిమాపక శాఖ జిల్లా అధికారి ధనుంజయ ఆధ్వర్యంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. అత్యవసర సమయాల్లో డయల్ 101, 100కు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో కంపెనీ హెచ్ఆర్ శివరామకృష్ణ, రాము, శివ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

(5వ పేజీ తరువాయి)

ఆసుపత్రి భవనం, ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్ నిర్మాణ పనులను పరిశీలించారు. సమావేశంలో కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, నారాయణపేట ఆర్డీవో రాంచందర్, పంచాయతీ రాజ్ ఎస్ఈ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్అండ్‌బీ ఎస్ఈ వసంత్‌నాయక్, ఎస్ఈ లీలావతి, ఈడబ్ల్యూ ఐడీసీ ఈఈ రాంకుమార్, ఇంజనీరింగ్ విభాగం ఈఈలు, డీఈలు పాల్గొన్నారు.

సమీకృత భవన నిర్మాణ పనుల పరిశీలన

దుద్యాల: మండల కేంద్ర శివారులో సమీకృత మండల కార్యాలయాల భవన నిర్మాణ పనులను బుధవారం కలెక్టర్ ప్రతీక్‌జైన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణ పనులకు ఇసుక కొరత లేకుండా చూడాలన్నారు. అనంతరం రైతు వేదికలో స్ఫూర్తి ఫౌండేషన్ ద్వారా ఎస్సీ మహిళలకు మూడు నెలల పాటు ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణను పరిశీలించారు. శిక్షణ పూర్తయిన తర్వాత బ్యాంకు రుణాలు ఇప్పించాలని మహిళలు కోరగా అందుకు కృషి చేస్తానని కలెక్టర్ తెలిపారు. అనంతరం దుద్యాల నుంచి నాచారం వరకు పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. గౌరారం గ్రామంలో నిర్మాణం జరుగుతున్న అంగన్‌వాడీ మోడల్ భవనాన్ని పరిశీలించారు.

10న పాంబండ ఆలయంలో వేలం

కులకచర్ల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బండవెల్కిచర్ల పాంబండ ఆలయంలో ఈనెల 10వ తేదీన కొబ్బరికాయల విక్రయానికి వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ కొల్ల మైపాల్‌రెడ్డి, ఈవో బాలనర్సయ్య బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జాతర సందర్భంగా సంవత్సరం పాటు కొబ్బరి కాయలు విక్రయించేందుకు (చిన్న జాతర 10రోజులు, పెద్ద జాతర 15 రోజులు మినహాయించి) వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ వేలంలో పాల్గొనే వారు ముందుగా రూ.10వేలు డిపాజిట్ చెల్లించాలన్నారు. గతంలో బకాయి ఉన్న వారు వేలానికి అనర్హులని తెలిపారు. వేలం దక్కించుకున్న వారు 50శాతం డబ్బులు అదేరోజు చెల్లించాలని తెలిపారు. సంవత్సరం పాటు (ఏప్రిల్ 1 నుంచి మార్చి 31 వరకు) ఆలయం ఆవరణలో కొబ్బరి కాయలు విక్రయించుకోవచ్చని అన్నారు. శ్రావణమాసం చిన్న జాతర 10రోజులు, పెద్ద జాతర ఉగాది 15రోజుల ముందు నుంచి కొబ్బరికాయలు విక్రయించుకోవడానికి మరో వేలం నిర్వహిస్తామని వివరించారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి


మోడల్ స్కూల్‌లో తనిఖీ చేస్తున్న అధికారులు

మర్పల్లి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని తహసీల్దార్ మునిరోద్దీన్, ఎంపీడీవో రాజమల్లయ్య, ఎంఈవో అంజిలయ్య హెచ్చరించారు. మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో బుధవారం మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. విద్యార్థులు పాఠశాల ఆవరణలో భోజనం చేయకుండా చెట్ల కింద కూర్చొని భోజనం చేయడం పట్ల అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా లేవని, పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

బంజార భవనానికి నిధుల మంజూరుపై హర్షం


రేవంత్‌రెడ్డి, తిరుపతిరెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

కొడంగల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో బంజారా భవనానికి ప్రభుత్వం రూ.3కోట్ల 65లక్షలు మంజూరు చేయడం హర్షనీయమని గిరిజన సంఘం నాయకులు అన్నారు. స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి చిత్రపటాలకు సేవాలాల్ మహారాజ్ సంఘం ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో సేవాలాల్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు శివరామ్ చౌహన్, సంతోష్‌నాయక్, ప్రధాన కార్యదర్శి, మాజీ కౌన్సిలర్ శంకర్‌నాయక్, మాజీ సర్పంచ్ డాక్యానాయక్, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు తార్యానాయక్, పాండునాయక్, శివరాథోడ్, రాజునాయక్, గోవింద్‌నాయక్ పాల్గొన్నారు.

పెద్దచెరువు ఎఫ్‌టీఎల్‌లో పూడ్చివేతలు

మేడ్చల్ టౌన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్ పెద్దచెరువు పరిధిలోని సర్వేనంబర్ 1002లో ఉన్న ఎఫ్‌టీఎల్ స్థలంలో మట్టి డంపింగ్ చేసి చెరువును పూడ్చివేత పనులు చేపడుతున్నారు. మేడ్చల్ నుంచి గౌడవెల్లికి వెళ్లే మార్గంలో ఉన్న పెద్ద చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న పట్టాభూమి యజమాని గతంలో నిబంధనలకు విరుద్ధంగా మట్టి డంపింగ్ చేసి చెరువు పూడ్చివేత చేపట్టగా స్థానికులు మేడ్చల్ తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన తహసీల్దార్ పనులను నిలిపివేశారు. ప్రస్తుతం తహసీల్దార్ బదిలీ కావటంతో సదరు భూయజమాని తిరిగి బుధవారం పూడ్చివేతలను ప్రారంభించారు. ప్రస్తుతం గౌడవెల్లి గ్రామం వైపు నుంచి మేడ్చల్ పెద్ద చెరువు వైపు వచ్చే వాగులో మట్టివేసి పూర్తిగా మూసివేసినట్లు స్థానికులు తెలిపారు. ఈ విషయమై స్థానికులు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

సంక్షిప్తంగా..

ఏఐ విద్యనందించడం అభినందనీయం

పరిగి: బెంగళూరుకు చెందిన ఎక్‌స్టెప్ ఫౌండేషన్ బృందం బుధవారం పరిగి మండలం గడిసింగాపూర్ ప్రభుత్వ పాఠశాలను సందర్శించింది. ఎక్‌స్టెప్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు అనంతి, బృందసభ్యులు కలిసి గడిసింగాపూర్ పాఠశాలలో ఏఐ పాఠ్యాంశాలు, సాంకేతికత బోధనను పరిశీలించి ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో రేణుకాదేవి, ఎంఈవో గోపాల్ పాల్గొన్నారు.

కబడ్డీ పోటీల్లో విజేతలుగా సెయింట్ పీటర్స్ కళాశాల విద్యార్థులు

మేడ్చల్ టౌన్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మ గూడ నర్సింహారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన 2కె25 జాతీయస్థాయి అంతర్-కళాశాల కబడ్డీ పోటీల్లో సెయింట్ పీటర్స్ కళాశాలకు చెందిన విద్యార్థులు విజేతలుగా నిలిచారు. ట్రోఫీ దక్కించుకున్న కబడ్డీ జట్టును కళాశాల యాజమాన్యం సన్మానించింది. ఈ కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి టీవీ.రెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ టి.సరోజారెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీలత పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

బంట్వారం: మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలోని 10వ తరగతి విద్యార్థులకు బుధవారం మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వెంకటేశం, యాదగిరి, నర్సింహులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

బంట్వారం: మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని బంట్వారం మండల విద్యాధికారి పి.వెంకటేశ్వరరావు అన్నారు. మండల పరిధిలోని మాలసోమారం గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల, అంగన్‌వాడీ సెంటర్‌ను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి సహభోజనం చేశారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని, పాఠశాలలో విద్యార్థుల హాజరుశాతాన్ని పరిశీలించారు.

దుద్యాల ఇన్‌చార్జి ఎంపీవోగా సత్యనారాయణ

దుద్యాల: దుద్యాల మండల ఇన్‌చార్జి ఎంపీవోగా సత్యనారాయణ బుధవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఆయన దుద్యాల పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మహేశ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు సత్యనారాయణను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు.

వీధి నాటకాలను కొనసాగించడం అభినందనీయం

యాలాల: వీధి నాటకాలను కొనసాగించడం అభినందనీయమని బీజేపీ సీనియర్ నాయకులు అమర్నాథ్‌రెడ్డి అన్నారు. మండలంలోని రాస్నం గ్రామంలో రెండు రోజులుగా సత్యహరిశ్చంద్ర వీధి నాటకం నిర్వహించారు. మంగళవారం రాత్రి కొనసాగిన వీధి నాటకంలో బీజేపీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు తమ వంతుగా కళాకారులకు రూ.5వేలను బహుమతిగా అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థుడు కోటం మల్లారెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగికి విరమణ తప్పదు

మోమిన్‌పేట్: సమాజంలో ప్రతీ ప్రభుత్వ ఉద్యోగికి విరమణ తప్పదని ఎంఈవో మల్లేశం అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన డాక్టర్ లింగంపల్లి రమేశ్‌రెడ్డి పదవీ విరమణ కార్యక్రమం నిర్వహించారు. రమేశ్‌రెడ్డి ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తూ ఆదర్శంగా నిలిచారని కొనియాడారు.

గొట్టిగఖుర్దులో సైన్స్ వైజ్ఞానిక ప్రదర్శన

బషీరాబాద్: మండలంలోని గొట్టిగఖుర్దు జడ్పీ ఉన్నత పాఠశాలలో కాంప్లెక్స్ స్థాయి సైన్స్ వైజ్ఞానిక ప్రదర్శనను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు ప్రదర్శనలిచ్చి మెప్పించారు. సైన్స్ మేళాలో కుప్పన్‌కోట్ ఎంపీపీఎస్ పాఠశాల విద్యార్థులు వాటర్ ప్యూరిఫికేషన్ పనితీరుపై ఎగ్జిబిట్ తయారు చేసి వివరించడంతో మొదటి బహుమతికి ఎంపికయ్యారు.

8న లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

బషీరాబాద్: దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని బషీరాబాద్ ఎస్ఐ పి.శంకర్ అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బుధవారం విలేకరులతో మాట్లాడుతూ రోడ్డు ప్రమాద కేసులు, వివాహ సంబంధిత కేసులు, చీటింగ్ కేసులు వంటి పలు కేసులపై ఇరువర్గాలు రాజీ పడినట్లయితే తాండూరు కోర్టులో జరిగే లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని సూచించారు.

క్రైం కార్నర్

యువకుడి బలవన్మరణం


రజినీకాంత్‌రెడ్డి(ఫైల్)

కీసర రూరల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఓయువకుడు బలవన్మరణానికి పాల్పడిన ఘటన బుధవారం కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ వివరాల ప్రకారం.. దమ్మాయిగూడ మున్సిపాలిటీ తిమ్మాయిపల్లికి చెందిన గూడూరు రజినీకాంత్‌రెడ్డి(38)అనే వ్యక్తి గ్రామంలో రేషన్‌డీలర్‌గా కొనసాగుతున్నాడు. కాగా మంగళవారం ఉదయం ఇంటి నుంచి బయల్దేరివెళ్లాడు. తిరిగి రాత్రి ఇంటికి చేరుకోలేదు. ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడు. దీంతో అతడి ఆచూకీ కోసం కుటుంబసభ్యులు బంధువులు, స్నేహితుల ఇంటివద్ద వెతికారు. అయినప్పటికీ ఫలితం లేకపోవడంతో కీసర పోలీసులను ఆశ్రయించారు. ఈ క్రమంలో బుధవారం ఉదయం ఫోన్ చేసి భార్య, పిల్లలతో మాట్లాడి వెంటనే ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడు. కాగా ఫోన్‌సిగ్నల్ ఆధారంగా అతడు ధర్మారం గుట్టల్లో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. అక్కడికి వెళ్లి చూడగా అతడు అప్పటికే మృతి చెందాడు. పక్కనే పురుగుల మందు డబ్బాను గుర్తించారు. రజినీకాంత్‌రెడ్డి శరీరం నల్లబడటంతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుని ఉంటాడని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అయితే రజినీకాంత్‌రెడ్డి మృతి పట్ల కుటుంబసభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. వారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులని కొందరు, కుటుంబ కలహాలే అతడి బలవన్మరణానికి కారణమని స్థానికులు అనుకుంటున్నారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి వ్యక్తి మృతి

పూడూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు బావిలో పడి వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని కుత్బుల్లాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. చెన్‌గోముల్ ఎస్ఐ మధుసూదనరెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కుత్బుల్లాపూర్ గ్రామానికి చెందిన జోగు తిరుపతయ్య(25) కరెంటు మెకానిక్, బోరుబావుల మరమ్మతు పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అయితే అదే గ్రామానికి చెందిన గొంగుపల్లి రాములు బుధవారం గ్రామంలోని చెదురు బావిలో ఉన్న బోరు మోటారును మరమ్మతులు చేయించేందుకు తిరుపతయ్యను తీసుకెళ్లాడు. ప్రమాదవశాత్తు కాలుజారి తిరుపతయ్య బావిలో పడిపోయాడు. దీంతో బావి నీటిలో మునిగి మృతి చెందాడు. గ్రామస్తులు స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వగా, అక్కడికి చేరుకుని తిరుపతయ్యను గ్రామస్తుల సాయంతో బావిలో నుంచి బయటకు తీశారు. అనంతరం ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. మృతుడి అన్న శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కులకచర్ల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపై ముందు వెళ్తున్న బైక్ సడన్‌గా బ్రేక్ వేయగా వెనక వస్తున్న మరో బైక్ ఢీ కొట్టడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. దోమ మండలంలోని మల్లెపల్లి గ్రామానికి చెందిన అంజిలయ్య, కుమారుడు నవీన్ కులకచర్ల నుంచి బైక్‌పై మల్లెపల్లికి బుధవారం సాయంత్రం వెళ్తున్నారు. బండవెల్కిచర్ల దాటిన తర్వాత ముందుగా వెళ్తున్న మరో బైక్ సడన్‌గా బ్రేక్ వేయగా ఆ బైకును వెనక నుంచి ఢీకొట్టారు. దీంతో అదుపు తప్పి కింద పడిపోగా ఇద్దరికి గాయాలయ్యాయి. 108 వాహనంలో చికిత్స నిమిత్తం అంజిలయ్య, నవీన్‌ను పరిగి ఆసుపత్రికి తరలించారు.

పేకాడుతున్న 8 మంది అరెస్టు


పోలీసుల అదుపులో నిందితులు

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): పేకాడుతున్న ఎనిమిది మందిని అరెస్టు చేసినట్లు ఘట్‌కేసర్ పోలీసులు తెలిపారు. సీఐ పరశురాం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ కొండాపూర్‌లోని ఇంటినెంబర్ 4-394లో ఎనిమిది మంది గుట్టు చప్పుడు కాకుండా పేకాడుతున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దాడిచేసి భువనగిరికి చెందిన పసుపులేటి శ్రీకాంత్, దమ్మాయిగూడకు చెందిన కావడి ప్రసాద్, కుషాయిగూడకు చెందిన పాముల శివయ్య, కొండాపూర్‌కు చెందిన రవి, కొత్తకోటకు చెందిన ఆకుల సాయికృష్ణ, ఘట్‌కేసర్‌కు చెందిన విజయ్‌ప్రధాన్, ప్రశాంత్, రాంపల్లికి చెందిన పిట్టల రాజులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.26,430నగదు, ఎనిమిది సెల్‌ఫోన్లు, ప్లేయింగ్ కార్డులను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కుక్కదాడిలో తల్లీ కొడుకులకు గాయాలు

కీసర, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): కుక్కదాడిలో తల్లీకొడుకులకు గాయాలైన ఘటన కీసర మండల పరిధిలో చోటుచేసుకుంది. బోగారం వన్నీగూడకు చెందిన పండుగ సత్తమ్మ(55సంవత్సరాలు), ఆమె కుమారుడు పండుగ నవీన్(37సంవత్సరాలు)పై బుధవారం పిచ్చికుక్క దాడి చేయడంతో వారికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో వారిని కీసర, ఘట్‌కేసర్ ప్రభుత్వాసుపత్రులకు తరలించారు. అక్కడ కుక్కకాటు ఇంజక్షన్ అందుబాటులో లేకపోవడంతో వారిని హైదరాబాద్‌లోని కోరంటీ ఫీవర్ ఆస్పత్రికి తరలించారు. నవీన్‌కాలికి తీవ్ర గాయం కాగా కుట్లు వేయాల్సిన అవసరం రావడంతో అక్కడి నుంచి ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. పిచ్చి కుక్క దాడిలో ఓ దూడ కూడా గాయపడింది.

రాయితీ దక్కేనా?

(5వ పేజీ తరువాయి)

లక్ష దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. దీనికితోడు చిన్నచిన్న కారణాలతో దరఖాస్తులను షార్ట్‌ఫాల్‌తో తిరస్కరిస్తున్నారనే విమర్శలు కూడా వస్తున్నాయి. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను రెవెన్యూ, ఇరిగేషన్, గ్రామ కార్యదర్శి తదితర అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాల్సి ఉండటంతో వారు చిన్న చిన్న కారణాలను సాకుగా చూపి దరఖాస్తులను తిరస్కరిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు అధికారులు ఆమోదించిన 5,820 దరఖాస్తుల్లో 2,165 దరఖాస్తులకు ఫీజు చెల్లించగా, 3,655 దరఖాస్తులకు ఫీజు చెల్లించలేదు.

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో టెక్నికల్ సమస్యలు

ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణను రిజిస్ట్రేషన్ కార్యాలయాల వద్దనే ఫీజు చెల్లించి రిజిస్ట్రేషన్‌లు చేసుకోవచ్చునని ప్రభుత్వం ప్రకటించిన విషయం విదితమే. కానీ రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో సాంకేతిక సమస్యలు తలెత్తుతుండటంతో ఈ ప్రక్రియ ముందుకు సాగడం లేదు. జిల్లాలో ఇప్పటి వరకు కేవలం కీసర రిజిస్ట్రేషన్ కార్యాలయంలో మాత్రమే ఒకే ఒక డాక్యుమెంట్ ప్రభుత్వం ప్రకటించిన విధానంలో రిజిస్ట్రేషన్ జరిగింది. గతంలో ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణ కోసం రూ.వెయ్యి చెల్లించిన వారి వివరాలు ప్రస్తుతం ఆన్‌లైన్‌లో చూపించడం లేదు. ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణ కోసం గతంలో రూ.వెయ్యి చెల్లించి ఉంటే అప్పటి మార్కెట్ విలువ ప్రకారం, లేదంటే ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో పూర్తిస్థాయిలో సాంకేతిక నిర్మాణం జరుగకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు.

నేడు తాగునీటి సరఫరాలో అంతరాయం

బొంరాస్‌పేట్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): బొట్లవనితండా దగ్గర చౌదర్‌పల్లి జంక్షన్ మెయిన్‌లైన్ మరమ్మతుల కారణంగా గురువారం తాగునీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈ శశాంక్ మిశ్రా, ఏఈ అభిషేక్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.